తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం
18 నవంబర్ 2026
పేజీలు : 08
Follow :





భావి శాస్త్రవేత్తల మేధోమథనం..

నల్లకంచె గురుకులంలో 'సైన్స్' సంబరం

- 63 పాఠశాలల విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలు
- ప్రతిస్టాల్‌ను ఆసక్తిగా తిలకించిన ఎమ్మెల్యే విద్యార్థులకు అభినందనలు
- సృజనాత్మకతకు ఇలాంటి వేదికలే పునాది





రంగారెడ్డి, నవంబర్ 17(జనంసాక్షి):

చిన్నారుల మేధస్సు నుంచి జాలువారిన అద్భుత ఆవిష్కరణలు.. సామాజిక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు.. వెరసి ఇబ్రహీంపట్నం మండలం నల్లకంచెలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణం మంగళవారం ఒక మినీ సైన్స్ మ్యూజియాన్ని తలపించింది. అక్కడ నిర్వహించిన జోనల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్) ఆద్యంతం ఆకట్టుకుంది. వివిధ జిల్లాల పరిధిలోని 63 పాఠశాలల నుంచి తరలివచ్చిన 252 మంది విద్యార్థులు తమ సృజనాత్మకతకు పదును పెడుతూ రూపొందించిన నమూనాలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి.

సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు..

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ పరిరక్షణ, నిత్యజీవితంలో ఎదురయ్యే సవాళ్లు, సామాజిక సమస్యల నిర్మూలన వంటి కీలక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు ఆలోచించిన తీరు అందరినీ ఆలోచింపజేసింది.

విద్యార్థుల ప్రతిభకు ఎమ్మెల్యే ఫిదా..

ఈ వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి గురుకుల విద్యార్థినులు సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఫెయిర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంతో ఓపికతో ప్రతి స్టాల్‌ను సందర్శించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాల పనితీరును అడిగి తెలుసుకోవడమే కాకుండా, వారితో ఆప్యాయంగా ముచ్చటించి ప్రోత్సహించారు.

ఇలాంటి వేదికలే భవిష్యత్తుకు పునాది..

"చిన్న వయసులోనే విద్యార్థులు ఇంతటి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించడం, వినూత్న ఆవిష్కరణలు చేయడం నిజంగా గర్వకారణం. విద్యార్థుల్లో నిద్రాణంగా ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి సైన్స్ ఫెయిర్‌లు గొప్ప వేదికలుగా నిలుస్తాయి" అని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కొనియాడారు. విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో గురుకుల పాఠశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది.

రోడ్డుపై ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్..

- పట్టించుకోని అధికారులు!
- వైఎస్సార్ కాలనీలో వాహనదారులకు తప్పని ప్రమాదాలు.

జవహర్ నగర్: (జనంసాక్షి):

జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుకు మధ్యలో సిమెంట్ దిమ్మెలతో సుమారు రెండు అంగుళాల ఎత్తులో నిర్మించిన మ్యాన్‌హోల్స్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకుండా పనులు చేపట్టడంతో రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వీధి దీపాలు సరిగా వెలగక పోవడంతో మ్యాన్‌హోల్స్ కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా అధికారులు పట్టించుకోకపోవడంపై కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఎత్తుగా ఉన్న మ్యాన్‌హోల్స్‌ను రోడ్డు స్థాయికి అనుగుణంగా సరిచేయాలని, వీధి దీపాలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే సమస్య పరిష్కరించకపోతే కాలనీవాసులందరినీ సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.



శేరిలింగంపల్లిలో 3,149 మందికి చేయూత పింఛన్లు మంజూరు

తొలి విడతలో 1,080 మందికి పత్రాల పంపిణీ చేసిన పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి, నవంబర్ 17 (జనం సాక్షి): చేయూత పింఛన్ పేదలకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా భరోసా కల్పించే పథకమని రాష్ట్ర ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్ కాజాగూడ చెరువు సమీపంలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన 1,080 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తాయన్నారు. నియోజకవర్గంలో మొత్తం 3,149 మందికి పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. వీరిలో శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో 1,080 మంది, చందానగర్‌లో 957 మంది, ఆల్విన్ కాలనీలో 1,112 మంది ఉన్నారని వివరించారు. ప్రజల సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీ, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వంటి పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ డాక్టర్ నారాయణ్ అమిత్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధిలో పిల్లల అభిప్రాయాలకు ప్రాధాన్యం

- యూనిసెఫ్ సహకారంతో 'లిజనింగ్ టు చిల్డ్రన్'పై అవగాహన సదస్సు

శేరిలింగంపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి):

పట్టణ ప్రణాళిక, అభివృద్ధి కార్యక్రమాల్లో పిల్లల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, వారిని ప్రత్యక్ష భాగస్వాములుగా చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ డాక్టర్ జి. సృజన సూచించారు. యూనిసెఫ్ సహకారంతో సీఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం కమిషనర్ కార్యాలయ ఆడిటోరియంలో 'లిజనింగ్ టు చిల్డ్రన్' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధిపతులు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, పట్టణ సమాజ అభివృద్ధి విభాగం అధికారులు, ప్రాజెక్ట్ అధికారులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, వార్డు స్థాయి రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. యూనిసెఫ్ సాంకేతిక బృందం కార్యక్రమ లక్ష్యాలు, మార్గదర్శకాలు, అమలు విధానంపై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించింది. ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల ఒప్పందంలోని ఆర్టికల్ 12 ప్రకారం ప్రతి చిన్నారికి తమను ప్రభావితం చేసే అంశాలపై స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు ఉందని కమిషనర్ తెలిపారు. పిల్లలను కేవలం ప్రభుత్వ సేవల లబ్ధిదారులుగా కాకుండా పట్టణ అభివృద్ధిలో భాగస్వాములుగా గుర్తించాలన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, పాఠశాలలు, ప్రజా రవాణా, వీధి దీపాలు, పారిశుద్ధ్యం,



వినోద సదుపాయాలపై వారి అభిప్రాయాలను సేకరించడం ద్వారా భద్రతా సమస్యలు, మౌలిక వసతుల లోపాలను గుర్తించవచ్చని పేర్కొన్నారు. సీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల్లో కార్యక్రమం అమలుకు యూనిసెఫ్ రూపొందించిన టూల్‌కిట్లు, అసెస్‌మెంట్ నమూనాలపై సదస్సులో వివరించారు. భద్రతా మ్యాపింగ్, పరిసరాల పరిశీలన, గ్రూప్ చర్చలు, చిత్రాల ద్వారా అభిప్రాయాల సేకరణ వంటి పద్ధతులను వివరించారు. పిల్లల భద్రత, స్వచ్ఛంద భాగస్వామ్యం, వివక్షకు తావులేకపోవడం, వారి అభిప్రాయాలపై పెద్దల ప్రభావం పడకుండా చూడటం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అన్ని వార్డుల్లో పిల్లలతో సంప్రదింపులు జరిపి వారి సూచనలు, సమస్యలను నమోదు చేయాలని యూసీడీ విభాగం ప్రాజెక్ట్ అధికారులు, సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. సేకరించిన అభిప్రాయాలను మున్సిపల్ ప్రణాళికలు, అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం చేయాలని, వాటి ఆధారంగా తీసుకున్న చర్యలను తిరిగి పిల్లలకు తెలియజేసేలా ఫీడ్‌బ్యాక్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

మైదుకూరు జడ్పీటీసీగా విజయం సాధించిన కృష్ణ కిషోర్‌కు సన్మానం

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి



తాండూరు నవంబర్ 17(జనంసాక్షి)ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మైదుకూరు నియోజకవర్గం మైదుకూరు జడ్పీటీసీగా అఖండ విజయం సాధించిన కృష్ణ కిషోర్ కి ఘన సన్మానం జరిగింది.ఈ సందర్భంగా తాండూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి మాట్లాడుతూ మైదుకూరు జడ్పీటీసీగా అఖండ విజయం సాధించిన కృష్ణ కిషోర్ కి హృదయపూర్వక అభినందనలు. ప్రజల ఆశీస్సులతో గెలిచిన మీరు, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరుకుంటున్నానని తెలిపారు.అనంతరం ఆయన శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు మరియు నాయకులు పాల్గొని కృష్ణ కిషోర్ గారికి శుభాకాంక్షలు తెలిపారు.

గురుకుల బాలికల కళాశాలలో ఫౌండేషన్ డే వేడుకలు

10వ తరగతి సెకండ్ టాపర్ యల్ సంజనకు సిల్వర్ మెడల్ ప్రదానం



తాండూరు నవంబర్ 17(జనంసాక్షి)టీజీ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో గంగా అరుణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గోల్డ్ , సిల్వర్ మెడల్స్ ఆఫ్ మెరిట్ ప్రదానోత్సవంలో 10వ తరగతిలో సెకండ్ టాపర్‌గా నిలిచిన యల్ సంజన విద్యార్థినికి సిల్వర్ మెడల్, ప్రశంసా పత్రం అందజేశారు.కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం. ఈ అవార్డులు విద్యార్థుల్లో మరింత స్ఫూర్తిని నింపుతాయి. గురుకుల విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాల ని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, గంగా అరుణ ఫౌండేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పల్ పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు

పాత భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.. ఆశా వర్కర్ల సమస్యలపై ఆరా



ఉప్పల్, నవంబర్ 17 (జనం సాక్షి): ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాత భవనాన్ని పరిశీలించి, దాని స్థానంలో అన్ని మౌలిక సదుపాయాలతో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.అనంతరం ఆశా వర్కర్లతో సమావేశమై వారి సమస్యలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ఆశా వర్కర్ల పాత్ర కీలకమని పేర్కొంటూ, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చెత్త డంపింగ్ యార్డ్, గ్రీన్ పవర్ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో రానివ్వం

: కర్నాటి రమేష్ గౌడ్



యాచారం, నవంబర్ 17(జనం సాక్షి) రాష్ట్ర ప్రభుత్వం 'శ్రీ వెంకటేశ్వర పవర్ గ్రిడ్ ప్రాజెక్టు' పేరుతో యాచారం రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేయదలచుకున్న చెత్త ఆధారిత విద్యుత్ (పవర్ గ్రిడ్) ప్రాజెక్టును తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ యాచారం మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై మండిపడ్డారు.ఈ సందర్భంగా కర్నాటి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంతటి కీలకమైన అంశంపై స్థానిక ఎమ్మెల్యే ఇప్పటివరకు స్పందించకపోవడం హాస్యాస్పదమని విమర్శించారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని సుమారు 700 టన్నుల చెత్తను ఇక్కడికి తరలించి, ఈ ప్రాంతాన్ని కాలుష్య కాసారంగా మార్చాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. తద్వారా స్థానిక ప్రజల జీవితాలతో చెలగాటమాడేందుకు ప్రయత్నిస్తోందని, ప్రజలందరూ ఏకమై ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఒకవైపు 'ఫ్యూచర్ సిటీ' పేరుతో భూములు తీసుకుంటూ, మరోవైపు ఇలాంటి కాలుష్య కారక ప్రాజెక్టులతో ప్రజా జీవితాలను నాశనం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుపై మండల వ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రాజెక్టును యాచారం గడ్డపై అడుగుపెట్టనివ్వబోమని స్పష్టం చేశారు. త్వరలోనే గులాబీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ ప్రాంత భవిష్యత్తు కోసం పార్టీలకు అతీతంగా అందరూ ఈ ప్రాజెక్టును వ్యతిరేకించాలని ఆయన కోరారు. యాచారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అందుకోసం త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఉమ్మడిగా ఉద్యమిద్దామని అన్ని పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాచ్చ భాష , పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు నాయక్, నాయకులు ఓరుగంటి యాదయ్య గౌడ్, బండిమీది కృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హెచ్ఎండిఏ కాంట్రాక్టు పనులు మాకెందుకు ఇవ్వరు

- **సర్పంచుల ఆవేదన**
- **మీరు గ్రామ సర్పంచ్లు అయితే నాకేంటి నేను ఎమ్మెల్యేను**
- **నేను చెప్పింది వింటేనే అభివృద్ధి పథకాలు అందుతాయి**
- **:చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**




నవాబుపేట్ నవంబర్ 17 (జనం సాక్షి)నవాబు పేట్ మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మండల పరిధిలోని వివిధ గ్రామాల అభివృద్ధి జరగాలంటే నేను చెప్పిందే వినాలి వెంటనే నిధులు మంజూరు చేస్తా నా వెంటనే ఉండాలి అంటున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు కొండల్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాలలోని హెచ్ఎండిఏ పనులు మాకెందుకు కాంట్రాక్టు ఎవరు అని ఎమ్మెల్యేను నిలదీశారు. వెంటనే ఎమ్మెల్యే నేను ఈ కార్యక్రమంలో చెప్పిందే అప్పుడే మీకు గ్రామ పనులు మంజూరుచేస్తానాని ఆయన తెలిపారు. అని మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండల పరిధిలోని వివిధగ్రామాలలో మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని సర్పంచులు తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే మిషన్ భగీరథ అధికారులకు సమస్యను తీర్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్సైజ్ అధికారులకు మండలంలోని వివిధ గ్రామాల్లో మద్యం అమ్ముతున్న దుకాణ యజమానులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. కుమ్మరిగూడ, గుబ్బెడి పత్యాపూర్, అత్తాపూర్ గ్రామాలలో విద్యుత్ స్తంభాలను గ్రామ సర్పంచులు అధికారులను కోరినారు. వెంటనే విద్యుత్ అధికారి గత వారంలో సమస్యలు పూర్తి చేస్తానని తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామం పంచాయతీలకు మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని తెలిపారు. గ్రామం పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో స్థిరంగా ఉండటం లేదని సర్పంచులు తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయానికి సమావేశం ఉన్న రోజే మిగతా రోజులు గ్రామాలలో సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని తెలిపారు. నవాబుపేట్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు బి టి రోడ్లు మంజూరు పూలపల్లి గేట్ నుండి గ్యాంగడా, ముబారక్పూర్ గ్రామం నుండి సంకేపల్లి గేట్ వరకు, పులుమామిడి నుండి ఎల్లకొండ, చిట్టి గిద్ద గేట్ నుండి చించల్ పేట వరకు, 7 కోట్లు మంజూరైనవని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాలలో అండర్ డ్రైనేజీ, సిసి రోడ్లు, మంచినీటి సమస్య, రాకుండా గ్రామం సర్పంచులు పనులు పూర్తి చేయలన్నారు.ఈ కార్యక్రమంలో పి ఏసీఎస్ చెర్మన్ ఆసిరెడ్డిగారిరంగారెడ్డి,మండలతహసీల్దార్ బుచ్చయ్య,ఎంపీడీఓ అనురాధ, మండల ల సర్పంచ్ ల సంఘము అధ్యక్షులు కొండల్ యాదవ్,ప్రభుత్వ వివిధ శాఖల మండల అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

12 ఏళ్ల కల తీర్చింది.. ప్రజా ప్రభుత్వం

పెన్షన్ మంజూరు పత్రాల కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



మర్పల్లి నవంబర్ 15 (జనంసాక్షి) అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మర్పల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని ఆయన చేతులు మీదుగా లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ రావడం అనేది లబ్ధిదారులకు 12 ఏళ్ల కల అని గత ప్రభుత్వ ఆయాంలో పెన్షన్ రావాలంటే లబ్ధిదారులు ఎన్నో ఇబ్బందులు గురయ్యారని ఇప్పుడు ప్రజా ప్రభుత్వం లో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరి పత్రాలను అందజేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు కోసం ప్రతిరోజు 18 గంటల పాటు నిర్వాహంగా కష్టపడుతున్నారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల రూపాయలను అప్పు చేసిందని వాటిని వడ్డీలు కూడా ప్రజా ప్రభుత్వమే కడుతుందన్నారు ప్రజా ప్రభుత్వం ఎక్కడ సంక్షేమ పథకాలను ఆపడం లేదని అభివృద్ధి కార్యక్రమాలను ఆపడం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి మహిళలను లక్షాధికారులను చేయాలని వడ్డీ లేని రుణాలను ఇచ్చారని మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులు చేయాలన్న గొప్ప సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి మహిళల పేరిటనే అమలు చేస్తున్నామన్నారు. వికారాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఇప్పటికే 1000 కోట్ల రూపాయల నిధులతో రోడ్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేశామని, రైతులకు అందించవలసిన సబ్సిడీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. ఈనెల 19వ తేదీన సిద్దిపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ జీవిత బీమా పథ కాన్ని అమలు చేయబోతున్నామని, ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా అందించే గొప్ప పథకమని అన్నాను. ఎల్ నీ ఓ ప్రభావం వల్ల కరువు పరిస్థితి వచ్చే అవకాశం ఉంది కనుక ప్రజలు రైతులు కరెంటు నీటిని పొదుపుగా వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ నరసింహారెడ్డి, తహసిల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీవో శాంతమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, రాములు యాదవ్, సర్పంచులు, కార్యదర్శిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం

నూతన కమిటీ ప్రకటన నియామక పత్రాలు అందజేత



జవహర్ నగర్: నవంబర్ 17 (జనంసాక్షి):భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా పదాధికారుల సమావేశం జిల్లా అధ్యక్షుడు కైరా యాదగిరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కైరా యాదగిరి మాట్లాడుతూ ఎస్సీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం అందేలా నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తామని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.దాసి నాగరాజు మాట్లాడుతూ నవంబర్ 26న నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ చైతన్య యాత్ర, ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా మేడ్చల్ రూరల్ జిల్లా ఎస్సీ మోర్చా నూతన కమిటీని ప్రకటించి, నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. పార్టీ బలోపేతంతో పాటు ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు ఏనుగుల లక్ష్మయ్య, సుజాత, వేల్పుల సన్నీ, జిల్లా నాయకులు మరాటి చుక్కయ్య, మంచాల మహేందర్, మరాటి బాబు, జామ్ సుధాకర్, చంచల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

సీపీఎం డిమాండ్

హయత్‌నగర్, నవంబర్ 17 (జనం సాక్షి)ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకుంటున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం హయత్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ.. సర్వే నంబర్ 71లోని ప్రభుత్వ భూములను చుట్టుపక్కల సర్వే నంబర్లకు చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. సర్వే నంబర్లు 71/2, 71/3కు చెందిన కొందరు వ్యక్తులు హుడా లేఅవుట్‌లోని రోడ్డును ధ్వంసం చేసి, బజార్ ప్రాంతాన్ని సైతం ఆక్రమించుకున్నారని తెలిపారు. అదేవిధంగా వెంకటేశ్వర కాలనీలో వీకర్ సెక్షన్ పట్టాలు కలిగిన కొందరు, సర్వే నంబర్లు 131, 132కు చెందిన మరికొందరు వ్యక్తులు పక్కనే ఉన్న సర్వే నంబర్ల పేర్లతో రిజిస్ట్రేషన్లు, నోటరీలు చేయించుకుని సర్వే నంబర్ 71లోని ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుంటున్నారని ఆరోపించారు. ఈ విధంగా ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించడమే కాకుండా, విక్రయిస్తూ పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు.సర్వే నంబర్ 71లోని ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఆ భూములను 118 జీవో కింద క్రమబద్ధీకరించుకునేందుకు చేసుకున్న దరఖాస్తులను నిలిపివేసి, అక్రమ ఆక్రమణలను అడ్డుకోవాలని తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసర నర్సిరెడ్డి, సర్కిల్ కమిటీ సభ్యులు కొత్త గణేష్ గౌడ్, తిరుమల సంధ్య, బిట్రా మూర్తి, కొత్త మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం



: ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

- **యాలాల మండలంలో 793 మందికి కొత్త పెన్షన్ల పంపిణీ**
- **దౌలాపూర్‌లో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం**

యాలాల నవంబర్ 17 (జనం సాక్షి):: రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం అమలు చేస్తోందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. యాలాల ఎంపీడీవో కార్యాలయం వద్ద మండలానికి చెందిన 793 మంది లబ్ధిదారులకు ఆయన కొత్త పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెన్షన్ల మంజూరులో ఎక్కడా అవినీతి జరగకూడదని స్పష్టం చేశారు. “పెన్షన్ ఇప్పిస్తామని నాయకులైనా, అధికారులైనా ఎవరైనా డబ్బులు అడిగితే ఊరుకునేది లేదు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం” అని హెచ్చరించారు. ఏళ్ల తరబడి రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న పేదల కలలను ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. నేరుగా ప్రజల వద్దకే వచ్చి పెన్షన్ పత్రాలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. గత పాలకులు మాటలు మాత్రమే చెప్పారని, తాము మాత్రం పనులు చేసి చూపిస్తున్నామని అన్నారు. అధికారంలోకి రాగానే పేదలకు కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రుణమాఫీ చేశామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే 200 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వరి కొనుగోలు కేంద్రాల బాధ్యత అప్పగించామని, త్వరలో ఇందిరమ్మ చీరలు కూడా పంపిణీ చేస్తామని వెల్లడించారు.జుంటుపల్లి ప్రాజెక్టు పనులకు రూ.5 కోట్లు మంజూరు చేసి పనులు మొదలుపెట్టామని, చివరి భూముల వరకు నీరందిస్తామని తెలిపారు. త్వరలో శివసాగర్ ప్రాజెక్టు పనులు కూడా ప్రారంభిస్తామన్నారు.దౌలాపూర్ లో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కడుతున్నామని, ఏడాది లోపు దీనిని పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలకు ఉదయం అల్పాహారం అందిస్తున్నామని చెప్పారు. యాలాల మండలంలోని అన్ని రోడ్ల పనులను ఏడాది లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. లక్ష్మీనారాయణపూర్--దేవనూర్, లక్ష్మీనారాయణపూర్--మైల్వార్ రోడ్ల పనులు జరుగుతున్నాయని, కోకట్ బ్రిడ్జిని కూడా నిర్మిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు భవనాలు, పంచాయతీ భవనాలు, బడులకు ప్రహరీ గోడలు కట్టిస్తున్నామని చెప్పారు.తాండూరు నియోజక వర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికై పోరాడుతాం

బిజెపి యువ మోర్చా రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి కళ్లెం సూర్య ప్రకాష్



షాబాద్, నవంబర్ 17(జనం సాక్షి); పార్టీ అభివృద్ధికై అహర్నిశలు శ్రమిస్తామ ని యువ నాయకులు కళ్లెం సూర్య ప్రకాష్ అన్నారు.భారతీయ జనతా యువమోర్చా రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా షాబాద్ మండలం బోడంపహాడ్ చెందిన యువ నాయకులు కళ్లెం సూర్య ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యార్థి దశ నుంచే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లో చురుగ్గా పనిచేస్తూ విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడిన ఆయన సేవలను గుర్తించిన పార్టీ నాయకత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది.ఈ సందర్భంగా కళ్లెం సూర్య ప్రకాష్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని యువతకు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తానని తెలిపారు. నిరుద్యోగులకు తక్షణమే ఉద్యోగ అవకాశాలుకల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో ఏర్పాటవుతున్న పరిశ్రమలు, కంపెనీలలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇస్తూ మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా ఊటు నరేష్



మహేశ్వరం,నవంబర్17(జనంసాక్షి): కందుకూరు మండలం ముచ్చర్ల గ్రామా నికి చెందిన ఊటు నరేష్ ను బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అభినయ్ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో ప్రకటించారు.ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి ఊటు నరేష్ మాట్లా డుతూ...రాష్ట్రంలో యువతరం ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం యువతరానికి ఇచ్చిన హామీలన్నిటిని తుంగలో తొక్కిందన్నారు.బీజేపీ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు.తనపై నమ్మకంతో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా పదవి అప్పగించిన బీజేపీ రాష్ట్ర,జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



యాలాల నవంబర్ 17 (జనం సాక్షి) : అనారోగ్యంతో ఆసుపత్రుల పాలై, వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి భరోసా కల్పించారు. మంగళవారం యాలాల మండలం అగ్గనూరు పంచాయతీ పరిధిలోని మల్ రెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాధితులకు ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు.ఇందులో భాగంగా గ్రామానికి చెందిన ఉద్దెర నందిని కుటుంబానికి రూ. 37,500, అంజిలమ్మ కుటుంబానికి రూ. 18,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉద్దెర ఆనంద్, మైహిపాల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

యాచారం మండలానికి 682 నూతన పెన్షన్లు మంజూరు

లబ్ధిదారుల్లో హర్షం



యాచారం, నవంబర్ 17(జనం సాక్షి)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పెన్షన్లలో భాగంగా యాచారం మండల వ్యాప్తంగా 682 నూతన పెన్షన్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా నందివనపర్తి గ్రామానికి 41 పెన్షన్లు మంజూరయ్యాయి. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు.సామాజిక భద్రతకు భరోసాగా నిలిచే ఈ పెన్షన్లు అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ఎంతో తోడ్పాటునందించనున్నా యి. తమకు పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు నూకం శ్రీలత--మహేందర్, తెల్గమల్ల భవాని--నరేందర్, మహ్మద్ హాజీ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్రే శ్రీశైలం, పార్టీ సీనియర్ నాయకులు తెల్గమల్ల రవి, ముచ్చర్ల సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా రూరల్ బీజేపీ ఎస్సి మోర్చా ఉపాధ్యక్షులుగా జాముసుధాకర్



శామీర్ పేట్, నవంబర్ 17(జనం సాక్షి)మేడ్చల్ జిల్లా రూరల్ బిజెపి ఎస్సి మోర్చ ఉపాధ్యక్షులుగా మూడు చింతల పల్లికి చెందిన జాము సుధాకర్ ను నియమిస్తు నియామక పత్రాన్ని బిజెపి రాష్ట్ర ఎస్సి మోర్చ అధ్యక్షుడు క్రాంతికిరన్ సూచనల మేరకు మంగళవారం అందజేశారు. మేడ్చల్ జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షుడు కైర యాదగిరి ఆధ్వర్యంలో నిర్వ హించిన ఎస్సి మోర్చ కార్యవర్గ సమావేశానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఎస్సి మోర్చా ప్రధాన కార్యదర్శి దాసి నాగారాజు, మేడ్చల్ జిల్లా ఎస్సి మోర్చ అధ్యక్షుడు కైర యాదగిరి, జిల్లా ఎస్సి మోర్చ ప్రధాన కార్యదర్శులు మరాటి బాబు, మంచాల మహేందర్, రాష్ట్ర ఎస్సి మోర్చ్ అధికార ప్రతినిధి ముత్యం సుజాత, ఇతర బిజెపి నాయకుల సమక్షంలో జాము సుధాకర్ కు నియామక పత్రాన్ని అందించి శు భాకాంక్షలు, అభి నందనలు తెలియ జేశారు.అనంతరం ఎస్సి మోర్చ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు జాము సుధాకర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర న్యాయకత్వానికి, జిల్లా నాయకులకు, బిజెపి పార్టీ కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యువతకు గంజాయి సరఫరా..రెండు నెలలుగా పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్



శంకర్ పల్లి,నవంబర్ 17 (జనం సాక్షి)శంకర్‌పల్లి ప్రాంతంలో గంజా యి విక్రయాలు, సరఫరాకు పాల్పడుతున్న పాత నేరస్థుడు మహమ్మద్ వజీర్‌ను శంకర్ పల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.పలు ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుడిగా ఉన్న వజీర్ గత రెండు నెలలుగా పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు గత సెప్టెంబర్‌లో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకోగా,వారికి గంజాయి సరఫరా చేసినట్లు దర్యాప్తులో గుర్తించి వజీర్‌పై కేసులు నమోదు చేశారు.విశ్వసనీయ సమాచారం మేరకు శంకర్ పల్లి సి.ఐ రుద్వీర్ కుమార్ తన సిబ్బందితో కలిసి నిందితుడిని అరెస్టు చేసి చేవెళ్ల న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ..యువత,విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయాల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సి.ఐ రుద్వీర్ కుమార్ సూచించారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన



కేశంపేట, నవంబర్ 17 (జనం సాక్షి): మండలంలో నేడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనుమగళ్ళ రమేష్ ఒక ప్రకట నలో తెలిపారు. మండల కేంద్రంలోని నూర్ ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం 2 గంటలకు వివి ధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చేయూత పింఛన్లు పంపిణీ చేస్తారని అన్నారు. అనంతరం మంగళిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ,మహిళా సమైక్య భవనాలను ప్రారంభించి గ్రామంలోని లబ్ధిదారులకు చేయూత పిన్నన్లు, స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారని రమేష్ తెలిపారు.

బీజేపీ జిల్లా యువ మోర్చా లీగల్ కో-కన్వీనర్‌గా మణికంఠ



కేశంపేట, నవంబర్ 17 (జనం సాక్షి) : మండల పరిధిలోని పోమాల్ పల్లి గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు కంచుకోట మణికంఠ బీజేపీ జిల్లా యువ మోర్చా లీగల్ కో- కన్వీనర్గా నియమితులయ్యారు.బిజెపి కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసిన మణికంఠకు జిల్లా లీగల్ కో-కన్వీనర్ గా పదవి రావడంతో మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు,అభినందనలు తెలిపారు. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని మణికంఠ అన్నారు.

అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థిని క్లాసులోకి అనుమతించని పాఠశాల యాజమాన్యం

పాఠశాల ముందు అయ్యప్ప స్వాముల నిరసన
బిగివచ్చిన యాజమాన్యం ఇకపై ఇలా తప్ప జరగదన్న పాఠశాల సిబ్బంది



జనంసాక్షి/నాచారం: అయ్యప్ప స్వామి మాల వేసుకున్నారని విద్యార్థులను క్లాస్ రూమ్ లోకి అనుమతించని సంఘటన హెచ్ఎంటి డివిజన్లోని రాఘవేంద్ర నగర్ లో గల సెయింట్ పీటర్స్ మోడల్ స్కూల్లో చోటుచేసుకుంది. కార్తీక మాసం సందర్భంగా అయ్యప్ప స్వామిని ఆరాధించే భక్తులు అయ్యప్ప స్వామి మాలన వేసుకొని నియమ నిబంధనలతో నిష్ఠంగా అయ్యప్ప స్వామిని కొలుస్తుంటారు. ఆ విధంగా ఆచారం హెచ్ఎంటి నగర్ లోని 10 పీటర్స్ పాఠశాలకు సంబంధించిన తొమ్మిదవ తరగతి విద్యార్థి ఎన్ సాత్విక్ గౌడ్ అయ్యప్ప స్వామి మా లను మొదటిసారి వేసుకున్నట్టు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. అయ్యప్ప స్వామి మాలను ధరించిన కూడా పాఠశాల విషయంలో మాత్రం స్కూల్ కి సంబంధించిన యూనిఫామ్ తో పాటు కేవలం కండువాను మాత్రం మెడలో ధరించి చెప్పులు లేకుండా స్కూలుకు వెళ్లడం జరిగిందని విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. అయినా కూడా పాఠశాలకు సంబంధించిన సిబ్బంది మాత్రం గడుసుతనంగా వ్యవహరించి అయ్యప్ప స్వామి మాల కు మాకు ఎలాంటి సంబంధం లేదు నీ విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించి మెడలో ఉన్న కండువాను బ్యాగులో దాచుకొని యధావిధిగా బూట్లను ధరించి వస్తేనే క్లాస్ రూమ్ లోకి అనుమతిస్తామని రెండు రోజులుగా లైబ్రరీ వద్ద ఒంటరిగా కూర్చోబెట్టి విద్యార్థినికి మానసికంగా ఇబ్బందులకు గురి చేసినట్టు బాధితులు తెలిపారు. క్లాస్ రూమ్ లోకి అనుమతించకపోవడంతో ఇబ్బంది పడ్డ విద్యార్థి తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పగా వెంటనే ప్రిన్సిపల్ ను కలిసి ఈ విధంగా చేయడం సబబు కాదని దేవుడి పట్ల దీక్ష పట్ల అవమానించే విధంగా ప్రవర్తించకూడదని చెప్పినా కూడా వైస్ ప్రిన్సిపల్ పట్టించుకోకుండా ఇలాంటివి తమ స్కూల్లో అనుమతించమని రెండు రోజుల క్రితం చెప్పడంతో వారు స్థానిక అయ్యప్ప స్వాములకు బజరంగ్దళ్ సభ్యులకు ఇట్టి విషయాన్ని తెలియజేసినట్టు సాత్విక్ గౌడ్ విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. మంగళవారం రోజు ఉదయం అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున మరియు హిందూ సంఘాల నాయకులు భారతీయ జనతా పార్టీ నాయకులు కలిసి సెయింట్ పీటర్స్ మోడల్ స్కూల్ వద్ద శాంతియుతంగా అయ్యప్ప స్వామి నినాదాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనల్లో భాగంగా అయ్యప్ప స్వామి మాల ధరించిన విద్యార్థులపై పాఠశాల సిబ్బంది యాజమాన్యం చేపట్టిన తీరు పై మండిపడ్డారు. తమ భక్తిని కించపరిచే విధంగా వ్యవహరించిన సిబ్బంది యాజమాన్యం వెంటనే క్షమాపణ చెప్పి అయ్యప్ప స్వామి వేసుకున్నటువంటి విద్యార్థులను క్లాస్ రూములోకి కచ్చితంగా అనుమతించాల్సిందేనని పట్టుబట్టారు. లేనియెడల కచ్చితంగా అయ్యప్ప స్వాములకు పిలుపునిచ్చి ఈ విధంగా హిందూ ధర్మం పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న వారి మందబుద్ధిని తొలగించేటువంటి విధంగా శాంతియుతంగా నిరసనలు చేపట్టి మా యొక్క ధర్మాన్ని కాపాడుకొనుటకు కచ్చితంగా చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించినట్టు తెలిపారు. అనంతరం పాఠశాల యాజమాన్యం అయ్యప్ప స్వాముల తో చర్చించి అయ్యప్ప స్వాములు అందరికీ కూడా క్షమాపణ చెప్పి కచ్చితంగా మేము అనుమతిస్తామని ఏ మతానికి కులానికి పాఠశాల వ్యతిరేకం కాదని పాఠశాల సిబ్బంది అయ్యప్ప స్వాములతో మాట్లాడడం జరిగింది. అనంతరం భవిష్యత్తులో గాని ఇప్పుడు గాని అయ్యప్ప స్వామి మాల వేసుకున్న టువంటి విద్యార్థులకు యధావిధిగా అనుమతి ఉంటుందని పాఠశాలలో సిబ్బందితో గాని యాజమాన్యంతో గాని ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని లిఖితపూర్వకంగా కూడా రాసి ఇవ్వడం జరిగింది. ఈ విధంగా శాంతియుతంగా అయ్యప్ప స్వాముల విషయంలో సానుకూలంగా స్పందించినందున పాఠశాల యాజమాన్యానికి సైతం అయ్యప్ప స్వాములు ధన్యవాదాలు తెలిపి హిందూ ధర్మం పట్ల ఏ ధర్మమైన కూడా మనందరం భారతీయులం అనే మాటను మరువకుండా ఖచ్చితంగా భిన్నత్వంలో ఏకత్వంగా కలిసి ఉండాలని అయ్యప్ప స్వాములు కోరడం జరిగింది.

ఐదు రోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



షాబాద్, నవంబర్ 17(జనం సాక్షి); ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 100 శాతం అక్షరాస్యత సాధించాలి షాబాద్ మండలాన్ని ఉల్లాస్ -- నవ భారత్ సాక్షరతా కార్యక్రమం కింద రాష్ట్రంలోనే తొలి 100 శాతం అక్షరాస్య మండలంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి మంగళవారం అధికారులను ఆదేశించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటింటి సర్వేను ఐదు రోజుల్లో పూర్తి చేయాలని మండల అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టం చేశారు.సర్వే ప్రకారం షాబాద్ మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 15,507 కుటుంబాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కుటుంబాలను అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఎస్ ఈఆర్పి, వివోఏఎస్, వి బి -జి రామ్ జి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సమానంగా కేటాయించి, ప్రతి ఇంటిని సందర్శించి నిరక్షరాస్యులను గుర్తించాలని సూచించారు.ఈ సర్వేకు ఎంపీడీవో షాబాద్ మండల స్థాయి ఓవరాల్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎమ్మార్వో, ఎంఈఓ, సిడిపిఓ, ఏపీఎం, ఎస్ఇఆర్పి, ఏపీవో అధికారులు తమ పరిధిలోని సిబ్బందిని వెంటనే కేటాయించి, సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సర్వేలో భాగంగా 15 సంవత్సరాలు నిండిన ప్రతి నిరక్ష రాస్యుడిని గుర్తించి వయోజన విద్యాశాఖ అందించే ప్రొఫార్మాలో వివరాలు నమోదు చేయాలని, ముఖ్యంగా 15 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల నిరక్షరా స్యులందరినీ గుర్తించి ఉల్లాస్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సర్వే పూర్తయిన వెంటనే గ్రామాల్లో అక్షర కేంద్రాలను ఏర్పాటు చేసి, వాలంటీర్లు, కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత సహకారంతో బోధనా కార్యక్రమాలను ప్రారంభించాలని తెలిపారు. ప్రతి ఒక్కరికీ అక్షరాస్యత అందించడమే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేసి షాబాద్ మండలాన్ని వంద శాతం అక్షరాస్య మండలంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేకు అవసరమైన ప్రొఫార్మా, శిక్షణ, సాంకేతిక సహకారాన్ని జిల్లా వయోజన విద్యా ఉప సంచాలకులు శ్రీమతి కె. అనిత అందిస్తారని తెలిపారు.

తుర్కపల్లి హనుమాన్ బస్తిలో రోడ్డును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కౌన్సిలర్ యూసుఫ్ బాబా



శామీర్ పేట్, నవంబర్ 17(జనం సాక్షి) అలియాబాద్ మున్సిపాలిటి కార్యాల యం ముందు తుర్కపల్లి 13 వ వార్డు కౌన్సిలర్ యూసుఫ్ బాబా ఆధ్వర్యంలో కాలనీ ప్రజలు ఆందోళన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుర్కపల్లి వార్డు కార్యాలయం పరిధిలోని 2వ వార్డు హను మాన్ బస్తీలో సదరు ఇంటి యజమాని తన ఇంటి నిర్మాణాలను రోడ్డు, నాలపై దర్జాగా నిర్మించాడని ఆరోపించారు. రోడ్డుపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వాహానాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. ఇట్టి ప్రహారీ నిర్మాణంతో సుమారు 30 కుటుంబాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . గత నెల అక్టోబర్ 16న అలి యా బాద్ కమిషనర్ వెంకట్ రెడ్డికి రాత పూర్వకంగా పిర్యాదు చేశామని చెప్పారు. ఇట్టి నిర్మాణంపై కమిషనర్ పట్టించుకోవడం లేదని గ్రహించి మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి లో పిర్యాదు చేశామని తెలిపారు. అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలని, ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధితో అధికారులు చర్యలు చేపట్టి కాలనీ ప్రజలు ఇబ్బందులను గుర్తించి అక్రమ నిర్మాణాలను తొలగించి కాలనీ ప్రజలకు న్యాయం చేయ్యాలని డిమాండ్ చేశారు. అనంతరం అలియాబాద్ కమిషనర్ వెంకట్ రెడ్డిని వివరణ కోరగా తుర్కపల్లిలో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలని సదరు ఇంటి యజమానికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. సదరు ఇంటి యజమాని స్పందించకుంటే తదుపరి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .

చిన్నారుల వైజ్ఞానిక ప్రదర్శనలు అద్భుతం

జిల్లాలో మరిన్ని సైన్స్ ఫెయిర్లకు ప్రోత్సాహం అందిస్తాం

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా



హైదరాబాద్ సిటీ, నవంబర్ 17 (జనం సాక్షి) : విద్యతో పాటు వైజ్ఞానిక, సృజనాత్మక రంగాల్లోనూ చిన్నారులకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించిన ట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో మంగళవారం న్యూ బోయిన్‌పల్లిలోని తారా హోమ్‌లో ఈ ప్రదర్శన నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ చిన్నారులు రూపొందిం చిన వైజ్ఞానిక నమూనాల ను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిశు సంరక్షణ సంస్థల్లో ఆశ్రయం పొందుతున్న, ఆదరణకు నోచుకోని చిన్నారులకు కూడా తమ ప్రతిభను ప్రదర్శించేందుకు సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్ర మాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఇలాంటి ప్రద ర్శనలు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో మరిన్ని వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. జిల్లాలోని 46 శిశు సంరక్షణ సంస్థలకు చెందిన బాలురు, బాలికలు, దివ్యాంగ చిన్నారులు సహా 1,000 మందికి పైగా విద్యార్థులు ఈ ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వందన, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్ జగదాంబ, తారా హోమ్ వ్యవస్థాపకులు జోస్ మాతేవ్ పాల్గొని చిన్నారులను అభినందించారు. ఉత్తమ వైజ్ఞానిక ప్రాజెక్టుల ఎంపికకు జిల్లా సైన్స్ అధికారి ధర్మేంద్ర, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు నథానియా, శైలజ, శ్రావంతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్, జిల్లా బాలల రక్షణ అధికారి శ్రీనివాస్, సీడబ్ల్యూసీ సభ్యురాలు ప్రమోద, సీడీపీవోలు, తారా హోమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

సమగ్ర విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలి -- బీజేపీ డిమాండ్



నందిగామ , నవంబర్ 17(జనం సాక్షి)నందిగామ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు వడ్ల అరవింద్ చారి ఆధ్వర్యంలో పలువురు పార్టీ సీనియర్ నాయకులు మండల తహసీల్దార్ సైదులుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి షాద్నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ అందె బాబయ్య మాట్లాడుతూ.నంది గామ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతం తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని, అనేక ప్రాంతాల్లో బోరుబావులు పూర్తిగా ఎండిపోవడంతో పాటు పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పశువులకు అవసరమైన పచ్చిమేత, ఎండుగడ్డి కూడా అందుబాటులో లేకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తాగునీటి సమస్యతో పాటు వ్యవసాయానికి అవసరమైన సాగునీరు కూడా అందక వ్యవసాయ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.లి ఎమ్మెల్యే శంకరయ్య సొంత మండలాన్ని కరువు మండలంగా ప్రకటించక పోవడంతో రైతుల పట్ల ఆయనకున్న చిత్త శుద్ధి ఏమిటో తెలుస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల బీజేపీ అధ్యక్షులు వడ్ల అరవింద్ చారి మాట్లాడుతూ.. నందిగామ మండలంలోని అన్ని గ్రామాల్లో కాలుష్య ప్రభావం కారణంగా పంటల దిగుబడి గణనీయంగా తగ్గిందని, దీనికి తోడు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పంటలు సరిగా పండక, పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మండల తహసీల్దార్ మండలంలోని అన్ని గ్రామాలలో కరువు పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఆ నివేదిక ఆధారంగా నందిగామ మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఇస్నాతి శ్రీనివాసులు, జిల్లా గిరిజన మోర్చా నాయకులు మోహన్ సింగ్ నాయక్, మాజీ మండల అధ్యక్షులు బంటారం లక్ష్మణ్, సుధాకర్ అప్పా, మండల ప్రధాన కార్యదర్శులు ఎంకిరాల నరసింహ గౌడ్, హేమంత్ నాయక్, మండల ఉపాధ్యక్షులు మేడిశెట్టి కృష్ణమోహన్ గుప్తా, జంగయ్య, మండల కార్యదర్శి శ్రీధర్ గౌడ్, మండల ఓబీసీ నాయకులు విక్రాంత్ గౌడ్, సత్యం యాదవ్, ప్రశాంత్ గౌడ్. బూత్ అధ్యక్షులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ విషవాయువులతో ప్రజల ప్రాణాలకు ముప్పు

జవహర్ నగర్, దమ్మాయిగూడ ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి పట్టింపేది?

రూ.4 వేల పింఛన్ హామీని వెంటనే అమలు చేయాలి: ఎమ్మెల్యే మల్లారెడ్డి



జవహర్ నగర్: నవంబర్ 17: (జనంసాక్షి): జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న విషవాయువులు, దుర్గంధంతో జవహర్ నగర్, దమ్మాయిగూడ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నా రని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త శుద్ధి ప్రక్రియలో శాస్త్రీయ పద్ధతులు పాటించకపోవడంతో ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుని, చెత్త క్యాపింగ్ పనులకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించి శాస్త్రీయ పద్ధతుల్లో చర్యలు చేపట్టామని మల్లారెడ్డి గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో శుద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విషవాయువుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఆసరా పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు వెంటనే రూ.4 వేల పింఛన్ మంజూరు చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, దమ్మాయిగూడ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీత, బీఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ



శామీర్ పేట, నవంబర్ 17 (జనం సాక్షి)శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్న దానం చేపట్టగా పద్మారావు నగర్ కు చెందిన ప్రేమ్ కుమార్, కట్ట మైసమ్మ పంతులు వల్లూరు గోపాల్ లు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతి నిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు..

ఇస్తేమాకు భారీ ఏర్పాట్లు..నిధుల కొరత లేదు

:కలెక్టర్ నారాయణరెడ్డి



శంకర్ పల్లి,నవంబర్ 17 (జనం సాక్షి)రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పట్టణంలో డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇస్తేమా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం జంబోరీ గ్రౌండ్‌లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య,వివిధ శాఖల అధికారులు, ఇస్తేమా నిర్వాహకులతో ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది ఇస్తేమా నిర్వహణకు సంబంధించిన పెండింగ్ బకాయిలు రూ. 2.4 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ ఏడాది కార్యక్రమానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇస్తేమాపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రవాణా, భద్రత తదితర మౌలిక సదుపాయాలను పక్కాగా కల్పించాలని సూచించారు. అప్పగించిన పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీయుల్లా, చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్,జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్,తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, కమిషనర్ యోగేష్, సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, గోపాల్ రెడ్డి, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

డీసీసీ వైస్ ప్రెసిడెంట్ శివకుమార్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన హనుమంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్ నవంబర్ 17(జనం సాక్షి)కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బుయ్యేని శివకుమార్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి శివకుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో మాజీ వైస్ కౌన్సిలర్ కటకం జయరాం,గిరినగర్ డివిజన్ అధ్యక్షులు బుదానా కానక రావు, హమ్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాంకో చెరువు సుందరీకరణకు ఎమ్మెల్యే చొరవ



రాజేంద్రనగర్,నవంబర్17(జనంసాక్షి)చిత్రపురి కాలనీ, సాయి వైభవ్ కాలనీ, సాయి ఐశ్వర్య లేఔట్‌లోని సమస్యల పరిష్కారానికి శేరిలింగం పల్లి ఎమ్మెల్యే గాంధీ ఆధ్వర్యంలో సాయి వైభవ్ కాలనీ అధ్యక్షురాలు పద్మ, సాయి ఐశ్వర్య కాలనీ అధ్యక్షుడు చౌదరి, చిత్రపురి కాలనీ ప్రతినిధి అనిల్ కుమార్ వల్లభనేని జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. లాంకో చెరువు సుందరీకరణ, చిత్రపురి మెయిన్ కమాన్ నుంచి ఇగురు హోటల్ వరకు రోడ్డు విస్తరణ, సాయి వైభవ్ కాలనీలో పార్కులు, రోడ్ల అభివృద్ధి, సాయి ఐశ్వర్య లేఔట్ పార్కుల అభివృద్ధి చేపట్టాలని కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, త్వరలో పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, జోనల్ కమిషనర్‌కు పలు కాలనీల ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ నెల 26న జరిగే రాజ్యాంగ మహాసభను విజయవంతం చేయండి

భారత నాస్తిక సమాజం జిల్లా చైర్మన్ ఆర్.కే.నాగని



చేవెళ్ల, నవంబర్ 17 (జనంసాక్షి) డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేస్తున్న కులవాదులకు తగిన బుద్ధి చెప్పాలని భారత నాస్తిక సమాజం జిల్లా చైర్మన్ ఆర్.కే.నాగని అన్నారు. ఈ నెల 26న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న భారత రాజ్యాంగ మహాసభ కరపత్రాన్ని చేవెళ్లలోని మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26న జరిగే సభకు అంబేద్కర్‌వాదులు, దళిత, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన నాయకులు కరుణ్ ఆర్ట్స్, రాధాకృష్ణ, కొండేటి శరత్, శివగాళ్ల శేఖర్, గిరిగళ్ల లోకరాజు, రవి, తాళ్లపల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన పలువురు మైనార్టీ నాయకులు



ఖైరతాబాద్, నవంబర్ 17 (జనం సాక్షి) : ఖైరతాబాద్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు పెరుగుతోంది. బంజారాహిల్స్ డివిజన్‌లో హైమద్ ఖాన్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు మైనార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంజీఆర్) సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వం, తెలంగాణ అభివృద్ధికి ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు, కేటీఆర్ స్ఫూర్తితో పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రామ ప్రభాకర్ రెడ్డి, మాజిత్ ఖాన్, వసీం ఖాన్, ముదసిర్, అమీర్ ఖాన్, హేమంత్ కుమార్, క్షషీల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పింఛన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

475 చేయూత పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



నవాబుపేట్ నవంబర్ 17 (జనం సాక్షి) అర్హులైన ప్రతి ఒక్కరికి చేయుత పింఛన్ అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మంగళవారం నవాబుపేట్ మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్లో నవాబుపేట్ మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావు గారి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలు కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మండల పరిధిలోని వివిధ గ్రామా లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను 475 మంది ప్రజలకు అందజేసినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఎక్కడ నిలిపివేయడం లేదని తెలిపారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమం పథకాలను కొనసాగిస్తూనే మరిన్ని పథకాలను ప్రవేశం పెడుతున్న అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళల కోసం మహిళల కోసం మహాలక్ష్మి పథకం కిందఉచిత బస్సు ప్రయాణం విద్యార్థులకు విద్య అభివృద్ధికి. రైతుల సంక్షేమానికి అనేకం పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. అర్హులకు రేషన్ కార్డులు రైతు భీమా వంటి పథకాలను ఆదేశిస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల సంక్షేమం కోసమే ప్రతిరోజు సుమారు 18 గంటల పాటు కష్టపడుతుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గానికి 100 కోట్లు నిధులను మంజూరు చేస్తూ నియోజక గాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం అంటూ ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, సూపర్డెంట్ రమేష్, మండల పిఎసిఎస్ చైర్మన్ ఆసిరెడ్డి గారి రంగారెడ్డి, వైస్ చైర్మన్ తలారి ప్రభాకర్, నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావు గారి వెంకటరెడ్డి,నవాబ్పేట్ మండల సర్పంచ్ సంఘం అధ్యక్షులు కావలి కొండల్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, నవాబుపేట్ స్థానిక సర్పంచి గాజులగూడెం నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, మండల సీనియర్ నాయకులు యువజన సంఘాల డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు నియోజకవర్గ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక


నియోజకవర్గ ప్రింట్ మీడియా అధ్యక్షుడిగా మొగులయ్య
ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా రూప్‌సింగ్



తాండూరు నవంబర్ 17(జనంసాక్షి)తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజే -- హెచ్-143) తాండూరు నియోజకవర్గ నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మంగళవారం తాండూరు పట్టణంలోని హిమాలయ హోటల్ లో నిర్వహించిన ఈ ఎన్నికల్లో తాండూర్ నియోజకవర్గ ప్రింట్ మీడియా అధ్యక్షుడిగా మొగులయ్య (ఉదయం రిపోర్టర్, యాలాల), తాండూరు నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా రూప్ సింగ్ (సివిఆర్ న్యూస్), ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి ప్రహ్లాద చారి, ఉపాధ్యక్షులు జావిద్ హుస్సేన్, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆసిఫ్ హుస్సేన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.ఈ ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొగులయ్య, ఉపాధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా అనంతయ్య, సహాయ కార్యదర్శిగా నాగేందర్, కోశాధికారిగా పర్యాద కిరణ్ కుమార్ ఎన్నికయ్యారు .అదేవిధంగా తాండూరు డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా రూప్‌సింగ్ (సివిఆర్ న్యూస్), ప్రధాన కార్యదర్శిగా వీరేంద్ర ప్రసాద్ (ఎన్9 న్యూస్), డివిజన్ కోశాధికారిగా మ్యాతారి గణేష్ (మీ 31 న్యూస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు జర్నలిస్టులు అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకం

- **రాష్ట్రంలో కొత్తగా 4.63 లక్షల పింఛన్లు మంజూరు.. నెలకు రూ.114 కోట్ల అదనపు భారం**
- **ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ బీమా అమలు.. కోటి 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం**



ఉప్పల్, నవంబర్ 17 (జనం సాక్షి): రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉప్పల్ నియోజకవర్గంలోని ఎస్‌వీఎం ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా 4.63 లక్షల పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందుకోసం నెలకు రూ.114 కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ అర్హులైన నిరుపేదలకు పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లాలో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న 25,558 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు.ఉప్పల్ నియోజకవర్గంలో మొత్తం 4,278 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని, కాప్రా డివిజన్‌లో 1,271 మందికి, నాచారం డివిజన్‌లో 1,186 మందికి, ఉప్పల్ డివిజన్‌లో 1,821 మందికి పింఛన్లు మంజూరైనట్లు వివరించారు.ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమల్లోకి రానుందని, కోటి 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వయసున్న కుటుంబ యజమానికి ఈ బీమా వర్తిస్తుందని, దురదృష్టవశాత్తూ కుటుంబ యజమాని మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందుతుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లను కూడా స్థానిక అర్హులైన లబ్ధిదారులకే అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉప్పల్ ప్రాంతంలో చెరువుల అభివృద్ధికి ఇటీవల రూ.150 కోట్ల నిధులు వచ్చాయని, మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిగిలిపోయిన అర్హులైన దరఖాస్తుదారులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడాలని, మిగతా సమయాల్లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను వివరించారు. ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు.

మంగ్రాస్‌పల్లిలో వేగంగా కొనసాగుతున్న భూ రీసర్వే

- **486.07 ఎకరాల్లో సర్వే పూర్తి.. 80 శాతానికి పైగా పనులు పూర్తి**
- **ఆర్ఐ గోపాల్, జీపీఓ శ్రీవర్ధన్ పర్యవేక్షణలో సర్వే ముమ్మరం**
- **భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్వప్న**



వికారాబాద్, నవంబర్ 17 (జనంసాక్షి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమం వికారాబాద్ జిల్లా బంట్వారం మండల పరిధిలోని మంగ్రాస్‌పల్లి గ్రామంలో వేగంగా కొనసాగుతోంది. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన ఈ గ్రామంలో నవంబర్ 3వ తేదీ నుంచి ప్రారంభమైన భూ రీసర్వే ప్రక్రియ రైతుల సహకారంతో పారదర్శకంగా, పకడ్బందీగా సాగుతోంది.గ్రామ పరిధిలోని మొత్తం 74 సర్వే నంబర్లలో భూ రీసర్వే నిర్వహించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటివరకు 486.07 ఎకరాల్లో సర్వే పనులు పూర్తి కాగా, మొత్తం పనుల్లో దాదాపు 80 శాతానికి పైగా పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన సర్వే పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. మండల తహసీల్దార్ విజయ్ కుమార్ సూచనల మేరకు ఆర్ఐ గోపాల్, జీపీఓ శ్రీవర్ధన్ పర్యవేక్షణలో సర్వే పనులు కొనసాగుతున్నాయి. యువ సర్వేయర్లు రజినీకాంత్, భరత్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను పరిశీలిస్తూ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులకు భూ రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. భూముల హద్దుల విషయంలో భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా, భూ రికార్డుల్లో పారదర్శకత పెంపొందించడంతో పాటు రైతులకు తమ భూములపై స్పష్టమైన వివరాలు అందించడమే ఈ రీసర్వే ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొంటున్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, భూ రీసర్వే ప్రక్రియను ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్వప్న కూడా హాజరై పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని తెలుసుకున్నారు. గ్రామంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సర్వే సజావుగా సాగేందుకు గ్రామ ఉపసర్పంచ్ రియాజుద్దీన్, రెండో వార్డు సభ్యుడు పంజుగుల మల్లేశం సమన్వయం చేస్తూ సర్వే బృందానికి అవసరమైన సహకారం అందిస్తున్నారు. రైతులందరూ తమ భూములకు సంబంధించిన వివరాలు, పత్రాలతో సర్వే బృందానికి సహకరించాలని, భూముల హద్దుల విషయంలో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని గ్రామస్థులకు సూచిస్తున్నారు. మిగిలిన సర్వే పనులను కూడా త్వరగా పూర్తి చేసి రైతులకు భూ వివరాలపై స్పష్టత కల్పించే దిశగా అధికారులు ముందుకు సాగుతున్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమం

- **అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**
- **సంక్షేమ పథకాలను అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యం**
- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



తాండూరు నవంబర్ 17(జనంసాక్షి)ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమనిఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.మంగళ వారం తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండల కేంద్రంలో మండ లానికి చెందిన దాదాపు 1,031 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెన్షన్ పథకంలో అవినీతికి తావులేదు.. ఎవరైనా (రాజకీయ నాయకులైన, అధికారులైన) పెన్షన్ ఇప్పిస్తామని డబ్బులు అడిగితే సహించేది లేదన్నారు.అర్హతే ప్రామాణికంగా, ఎలాంటి అవినీతి, రాజకీయ ఒత్తిళ్లు లేకుండా పారదర్శకంగా పెన్షన్లు మంజూరు చేశాం. పెన్షన్లు, రేషన్ కార్డుల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పేద ప్రజల నిరీక్షణకు ప్రజా ప్రభుత్వం తెరదించింది. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మీ వద్దకే వచ్చి పెన్షన్ మంజూరు పత్రాలను అందించడం ఎంతో సంతోషంగా ఉంది.గత పదేళ్ల పాలనలో కొత్త పెన్షన్లు, రేషన్ కార్డుల కోసం ఎదురుచూసిన ప్రజలకు ఇప్పుడు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సంక్షేమ పథకాలను చిత్తశు ద్ధితో అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యం.రాష్ట్రంలోని పేద కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పంతో రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నాం.బషీరాబాద్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించాం. మండలంలోని రహదారులన్నింటినీ అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నాం.గతంలో జూనియర్ కళాశాలకు జీవోలు ఇచ్చి వదిలేశారు. కానీ నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి తరగతులను ప్రారంభించాం. నేడు విద్యార్థులు కళాశాలలో చదువుతున్నారు.ఈ నెల 19న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించబోతున్నాం. పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం.పార్టీలకు అతీతంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం. గ్రామాల్లో పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తున్నాం.మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు , మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. దశలవారీగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం.పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. నూతన ఇళ్లలో దీపావళి పండుగ చేసుకున్నాం.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించా లన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, ఆదుకునే వారు లేని అభాగ్యులు ప్రభుత్వ సహాయం కోసం ఇబ్బందులు పడకూడదన్నదే మా సంకల్పం.తాండూరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనిత , మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పోస్టర్ ఫ్రీ డ్రైవ్ నిర్వహణ



కుత్బుల్లాపూర్ నవంబర్ 17(జనం సాక్షి)సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10 రోజుల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా, మంగళవారం కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని గాజులరామారం సర్కిల్లో పోస్టర్ ఫ్రీ సైబరాబాద్ డ్రైవ్ నిర్వహించారు..ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా షాపూర్ నగర్ ఎక్స్ రోడ్ నుంచి సూరారం ఎక్స్ రోడ్ వరకు గాజులరామారం ప్రధాన రహదారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన రహదారుల వెంట, విద్యుత్ స్తంభాల పైఇతర బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన అనధికారిక పోస్టర్లను సిబ్బంది తొలగించడం జరిగింది. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడ0 సుందరంగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.ప్రజలు, వ్యాపారులు సంస్థల నిర్వాహకులు అనుమతులు లేకుండా అనధికారిక బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా మున్సిపల్ కార్పొరేషన్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేయడమైనది.ఈ కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ ఉప కమిష నర్ యు.వెంకట్ రాములు , డిప్యూటీ ఈ ఈ(ఎస్ఎం డబ్ల్యూ) నిఖి ల్ రెడ్డి , ఏఈ స్వాతి సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

దామస్తాపూర్ గ్రామంలో 30 మందికి చేయూత



మర్పల్లి నవంబర్ 17 (జనంసాక్షి) వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని దామస్తాపూర్ గ్రామానికి 30 మందికి చేయూత పింఛన్ మంజూరు పత్రాలను అందుకున్నారు. గ్రామంలో ఒంటరి మహిళా 2,వికలాంగులు 3,వితంతువు 25, పత్రాలను మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతిలో మీదుగా లబ్ధిదారులకు అందజేశామని గ్రామ సర్పంచ్ సంతోషి యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సంతోషి యాదగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్రమంతత ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా సంఘాల ద్వారా బస్సుల కొనుగోలు చేసి వాళ్ళ ఆర్థిక వృత్తిని మెరుగుపరిచిందన్నారు. రైతాంగానికి 24 గంటల ఉచిత కరెంటు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన గత అధికార కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండురంగా రెడ్డి, గోపాల్, మహేందర్ పసుల సురేష్.శ్రీనివాస్ వెంకటేశం. సమ్మయ్య.లక్ష్మయ్య.ఉన్నారు.

ఆదిభట్లలో రోడ్డు ప్రమాదం సెక్యూరిటీ సూపర్‌వైజర్ మృతి



రంగారెడ్డి నవంబర్ 17 జనంసాక్షి):రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఒక సెక్యూరిటీ సూపర్‌వైజర్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. రహదారి పక్కన ఎటువంటి హెచ్చరిక సూచికలు లేకుండా నిలిపి ఉంచిన డీసీఎం వాహనం ఆయన ప్రాణాలను బలిగొంది. ఈ విషాద ఘటన అడిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రమేష్ తెలిపిన వీరుల ప్రకారం. ఇబ్రహీం పట్నం మండలం పోచారం గ్రామానికి చెందిన బండి రాజు (39), జీఎంఆర్ ఏరోస్పేస్ టెక్నిక్ ఎఫ్ఎంసీలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. సోమవారం రాత్రి విధులకు హాజరైన ఆయన, మంగళవారం ఉదయం డ్యూటీ ముగించుకుని తన హోండా షైన్ ద్విచక్ర వాహనం టీఎస్ 07జేఎన్6285 పై స్వగ్రామానికి బయలుదేరారు. ఉదయం సుమారు 7గంటల సమయంలో మంగళపల్లి గ్రామం దాటి పోచారం వైపు వెళ్లే మార్గంలో, రహదారి పక్కన ఎటువంటి ఇండికేటర్లు, హెచ్చరిక సూచికలు లేకుండా నిర్లక్ష్యంగా నిలిపి ఉంచిన డీసీఎం వాహనం టీఎస్03 యూసీ8477ను బండి రాజు ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు తలకు, కుడి కంటికి తీవ్ర గాయాలై అధిక రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే ఆయనను వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అడిబట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అర్హులైన వారందరికీ పింఛన్ మంజూరు చేయాలి



అంబర్‌పేట్ నవంబర్ 17(జనంసాక్షి)అంబర్‌పేట్ పటేల్ నగర్ లో అర్హులం దరికీ పింఛలు మంజూరు చేయాలి అని బిజెపి నాయకుడు యశ్వంత్ అన్నారు. అంబర్‌పేట్ పరిధిలోని దివ్యాంగులకు, వితంతువులకు ఒంటరి మహిళకు రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా పెన్షన్ మంజూరు చేయడం సిగ్గుచేటు ,ఇద్దరు కొడుకులు ఉన్నారని మరియు 50 గజాలు ఇల్లు ఉందని చాలామందిని తిరస్కరించడం జరిగింది,అర్హులైన వారందరికీ పింఛలు మంజూరు చేయాలని విన్నపం,లేదంటే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున లేదంటే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని యశ్వంత్ పేర్కొన్నారు.


రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి
పీఏసీఎస్ చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి



కేశంపేట నవంబర్ 17 (జనం సాక్షి) : రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కొత్తపేట పీఏసీఎస్ చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన రైతులకు 55 లక్షల 63 వేల 50 రూపాయల దీర్ఘకాలిక, 8 లక్షల రూపాయల స్వయం ఉపాధి రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ. సహకార సంఘం ద్వారా రుణాలు పొందిన రైతులు సకాలంలో తిరిగి చెల్లించి సొసైటీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ రంగు శంకర్, సీఈఓ అనిల్, నాయకులు బుర్రి భూపాల్ రెడ్డి, ఐలాపురం హరీశ్వర్ రెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

లాబీయింగ్ కబంధహస్తాల్లో సంక్షేమ పథకాలు

స్వంత స్థలం లేని వారికి ఇందిరమ్మ ఇల్లు కలగానే మిగిలిపోనుందా



యాలాల నవంబర్ 17 (జనం సాక్షి) : ప్రభుత్వ మేనిఫెస్టోలోని హామీలు ఒక్కొక్కటిగా అమలవుతున్న వేళ, క్షేత్రస్థాయిలో అసలైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతోందా అన్న ప్రశ్న యాలాల మండల ప్రజల నుండి బలంగా వినిపిస్తోంది. నియోజకవర్గ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికీ, మండల మరియు గ్రామ స్థాయి నాయకుల 'లాబీయింగ్' కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోం దని స్థానికులు విమర్శిస్తున్నారు.అర్హులకు అందని ద్రాక్షగా ఇందిరమ్మ ఇల్లు... స్మార్ట్ కార్డులపై ఆందోళన :యాలాల మండలంలోని పలు గ్రామాల్లో సొంత స్థలం లేక, తలదాచుకోవడానికి గూడు లేక ఎందరో నిరుపేద కుటుంబాలు దయనీయ స్థితిలో జీవిస్తున్నాయి. నిబంధనల పేరుతో స్వంత స్థలం లేని నిరుపేదలకు 'ఇందిరమ్మ ఇల్లు' కేవలం కలగానే మిగిలిపోయే ప్రమాదం ఏర్పడిందని బాధితులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థలం లేని పేదలకు ప్రభుత్వమే స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు, అత్యంత కీలకమైన స్మార్ట్ కార్డుల (రేషన్ కార్డులు) పంపిణీ ప్రక్రియలోనైనా ఎలాంటి పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా పంపిణీ జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా అన్న చర్చ మండలవ్యాప్తంగా ప్రజల్లో నడుస్తోంది. ప్రభుత్వ పథకాల అమలులో వాస్తవ లబ్ధిదారుల ఎంపిక కంటే, స్థానిక నాయకుల సిఫార్సులకే పెద్దపీట వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. లోపభూయిష్టమైన సర్వేలతో పాలకులకే నష్టమంటున్న ప్రజలు :ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించకుండా, కేవలం మండల, గ్రామ స్థాయి నాయకుల మాటలనే శిరోధార్యంగా భావించి వారి జాబితాలకే ఆమోదముద్ర వేస్తే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని మండల ప్రజలు అభిప్రాయపడు తున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవాల సేకరణ లోపభూయిష్టంగా ఉన్నప్పుడు, ఆ నష్టం తక్షణమే కనిపించకపోయినా, ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రతినిధులపైనే ఆ ప్రభావం పడుతుందని స్థానికులు చర్చించుకుంటు న్నారు.మారని 'పార్టీ' ముద్ర... కమిటీలపై ప్రజల్లో అపనమ్మకం :ఏ ప్రభుత్వం మారినా, సంక్షేమ పథకాలు కేవలం అధికార పార్టీ కార్యకర్తలకు, అనుచరులకే దక్కుతాయనే అపవాదు నేటికీ తొలగిపోవడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. గ్రామస్థాయి కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక నిస్పార్థంగా జరుగుతుందని పాలకులు భ్రమపడితే, అది వారి రాజకీయ భవిష్యత్తుకు గెలుపు తెరలు మూసుకోవడమే అవుతుందని స్థానికులు అంటున్నారు. ఒకప్పటిలా నాయకుడు చెప్పిందే వేదం అనే రోజులు పోయాయని, నేడు స్వార్థ ప్రయోజనాలకు పెద్దపీట వేసే నాయకులను తాము నిశితంగా గమనిస్తున్నామని ఓటర్లు స్పష్టం చేస్తున్నారు. ప్రతి అంశాన్ని బేరీజు వేసుకునే స్థాయికి నేటి ఓటరు చైతన్యవంతుడయ్యాడని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.జంబ్లింగ్' విధానమే ఏకైక పరిష్కారమని ప్రజాభిప్రా యం :యాలాల మండలంలో ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ కార్డుల వంటి సంక్షేమ పథకాలు పక్కదారి పట్టకుండా ఉండాలంటే ప్రజాప్రతినిధులు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. స్థానిక నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ప్రజలే పరమావధిగా పనిచేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గ్రామ కమిటీలు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తు న్నాయా లేదా అన్నది తేల్చడానికి, ఇతర మండలాల అధికారులతో 'జంబ్లింగ్ సిస్టం' ద్వారా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని స్థానికులు సూచిస్తున్నారు. నిష్పక్షపాతమైన అధికారుల బృందం నేరుగా పేదల ఇళ్ల వద్దకు వెళ్లి వాస్తవాలను సేకరించి, అర్హులను ఎంపిక చేసినప్పుడే ప్రభుత్వ పథకాలకు సార్థకత చేకూరుతుందని మండల ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



రంగారెడ్డి, నవంబర్ 17 (జనంసాక్షి):విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నల్లకుంచెలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జోనల్ లెవల్ సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను విద్యారంగంలో ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజలకు నమ్మకం కలిగించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల భారాన్ని తగ్గించి, తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకుండా ఉండేలా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే పన్నెండో తరగతి వరకు ఒకే పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తయ్యేలా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు కాస్మోటిక్స్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ పిల్లలను చదివిస్తున్నారని, వారి కలలను సాకారం చేసే బాధ్యత విద్యార్థులపై ఉందన సూచించారు. ప్రభుత్వం అవసరమైన వసతులు కల్పించే బాధ్యత తీసుకుంటే, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకునే బాధ్యత విద్యార్థులదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చిలకమఠం రామాలయ ఆస్తుల పరిరక్షణకు జేపసీ డిమాండ్

సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం



అల్వాల్, నవంబరు 17 (జనంసాక్షి): అల్వాల్‌లోని చారిత్రక చిలకమఠం రామాలయ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి ఆలయ ఆస్తులను పరిరక్షించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అల్వాల్‌లోని జేఏసీ ప్రాంగణంలో సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలయ చరిత్ర, భూముల వివరాలను వెల్లడిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 350 ఏళ్ల చరిత్రకు సంబంధించిన ఆధారాలు 1961 జనగణన శాఖ ప్రచురించిన 'ఫెయిర్స్ అండ్ ఫెస్టివల్స్' పుస్తకంలో ఉన్నాయని తెలిపారు. అందులో ఆలయాలకు సంబంధించి 13 ఎకరాల భూమి ప్రస్తావన ఉందని పేర్కొన్నారు. రామాలయం, హనుమాన్ ఆలయం, శివాలయం ఒకే ప్రాంగణంలో ఉన్నట్లు, జైపూర్ నుంచి పాలరాతి విగ్రహాలను తీసుకొచ్చినట్లు చారిత్రక పత్రాల్లో నమోదైందని వివరించారు. ప్రస్తుతం ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు ఎలా ఇచ్చిందనే అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఆలయ భూముల హద్దులు, యాజమాన్య వివరాలను పరిశీలించి నిర్మాణాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే అనుమతులను రద్దు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చారిత్రక ఆలయాన్ని పునరుద్ధరించి, భవిష్యత్తు తరాలకు దాని వారసత్వాన్ని అందించాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేశారు.

అయ్యప్ప స్వాముల భవన నిర్మాణానికి రూ.51,000 విరాళం

మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి



తాండూరు నవంబర్ 17(జనంసాక్షి)పట్టణంలోని సాయిపూర్ 11వ వార్డు పరిధిలో వెలసిన మురుగన్ ఆశ్రమంలో అయ్యప్ప స్వాములు బస చేసేందుకు నూతన భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ భవన నిర్మాణానికి తన వంతు సహాయంగా మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి రూ.51,000 (యాభై ఒక్క వేల రూపాయలు) విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ నీరజా బాల్ రెడ్డి మాట్లాడుతూ మురుగన్ ఆశ్రమ స్వాముల సౌకర్యార్థం చేపడుతున్న భవన నిర్మాణానికి సహకరించడం చాలా సంతోషంగా ఉంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, ఆలయాల అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరుకుంటున్నానని ఆకాంక్షించారు.ఆమె అందించిన విరాళంపై మురుగన్ ఆశ్రమ నిర్వాహక అయ్యప్ప స్వాములు కృతజ్ఞతలు తెలిపారు.

100 ఫీట్ల రోడ్డుపై ప్రహరీ గోడ నిర్మాణం

సీసా స్కూల్ తీరుపై కాలనీ వాసుల ఆందోళన



అల్వాల్, నవంబర్ 17 (జనంసాక్షి): ఇప్పటికే మంజూరైన 100 ఫీట్ల రహదారి స్థలంలోకి వచ్చి సీసా స్కూల్ యాజమాన్యం ప్రహరీ గోడ నిర్మిస్తోందంటూ పరిసర కాలనీల వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. బొల్లారం--అల్వాల్ పరిధిలోని మహికా ఆయు హౌసింగ్ సమీపంలో ఉన్న పాఠశాల వద్ద నిర్మాణ పనులను స్థానికులు అడ్డుకున్నారు. స్నేహ కాలనీ, గణేష్ ఎన్‌క్లేవ్, రామేశ్వర్ నగర్, శ్రీ సాయినగర్ కాలనీల ప్రతినిధుల కథనం ప్రకారం.. ప్రతిపాదిత 100 ఫీట్ల రహదారికి సంబంధించి నిబంధనల ప్రకారం స్థలం వదలాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా రోడ్డుపైకి వచ్చి ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని, పది రోజుల క్రితం, మంగళవారం ఉదయం కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళన చేయగా పనులు నిలిపివేస్తామని చెప్పిన యాజమాన్యం, స్థానికులు వెళ్లిన తర్వాత తిరిగి ప్రారంభించిందని పేర్కొన్నారు.పాఠశాలలో 300 నుంచి 400 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ సరిపడా పార్కింగ్ సదుపాయం లేదని, ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని స్థానికులు తెలిపారు. సమీపంలో మరో పాఠశాల ఉండటంతో రాకపోకలకు మరింత ఇబ్బంది కలుగుతోందన్నారు. రహదారి స్థలంలో నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి, మంజూరైన రోడ్డు హద్దులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అల్వాల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు కాలనీ వాసులు వెల్లడించారు.

బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా వంగూరు సాయి



యాచారం, నవంబర్ 17(జనం సాక్షి) భారతీయ జనతా యువమోర్చా రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా యాచారం మండలం నంది వనపర్తి గ్రామానికి చెందిన వంగూరు సాయిని నియమిస్తూ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బుర్ర అభినయ్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.పార్టీ కోసం క్రియాశీలకంగా పనిచేస్తున్న సాయిని గుర్తించి ఈ బాధ్యత అప్పగించినట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు. జిల్లాలో యువమోర్చాను మరింత బలోపేతం చేసేందుకు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని నూతన అధికార ప్రతినిధి వంగూరు సాయి తెలిపారు.సాయి నియామకం పట్ల యాచారం మండల బీజేపీ, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

420 హామీల అమలుపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి

- మూడేళ్లు గడిచినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోని కాంగ్రెస్ హామీలు
- బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుభ ప్రద్ పటేల్



తాండూరు నవంబర్ 17(జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసి నేటితో మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుభ ప్రద్ పటేల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 2023 ఎన్నికల సమయంలో 420 హామీలు, ఆరు గ్యారంటీలు, వివిధ వర్గాల కోసం 13 డిక్లరేషన్ల పేరుతో ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కీలక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, రైతులకు రైతు భరోసా, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా, వృద్ధులు, వితంతువులకు రూ.4,000 పింఛన్ వంటి హామీలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన రూ.లక్ష కోట్ల నిధులు, 42 శాతం రిజర్వేషన్ల హామీ అమలు పరిస్థితి ఏమిటో ప్రభుత్వం వెల్లడించాలని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉద్యోగ నియామకాల విషయంలో కూడా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అన్నారు.

వికారాబాద్ జిల్లాకు సంబంధించి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు, పెండింగ్ అభివృద్ధి పనులు, విద్యా, వైద్య సదుపాయాల కల్పనపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం ఓట్ల కోసం చేసిన ప్రకటనలుగా మిగిలిపోకూడదని, మూడు సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా 420 హామీల అమలుపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని శుభ ప్రద్ పటేల్ డిమాండ్ చేశారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన అల్కాపూర్ టౌన్‌షిప్

- అయ్యప్ప పాటలు, భజనలు, స్వాముల ఆటపాటలతో వైభవంగా ఐదో మహా పడిపూజ

రాజేంద్రనగర్, నవంబర్17(జనంసాక్షి) :

మణికొండ డివిజన్ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఐడియల్ బిల్డర్స్ సురేష్ స్వామి ఆధ్వర్యంలో ఐదో మహా పడిపూజ కార్యక్రమం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేశవ గురు స్వామి, గంగపుత్ర నరసింహారావు స్వామి, తిరుపతి రావు ప్రసాద్ గురుస్వాముల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ, కుమారస్వామి పూజ నిర్వహించి, అనంతరం అయ్యప్ప స్వామికి విశేష అభిషేకాలు, రుద్రాభిషేకం, పుష్పాభిషేకం, ప్రత్యేక అలంకరణలు, దీపారాధన, హారతి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురుస్వాముల మంత్రోచ్ఛారణలు, అయ్యప్ప నామస్మరణతో అల్కాపూర్ టౌన్‌షిప్ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. అనంతరం అయ్యప్ప భజనలు, భక్తిగీతాలు, పాటలతో స్వాములు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అయ్యప్ప పాటలకు స్వాములు ఉత్సాహంగా



ఆటపాటలతో సందడి చేస్తూ మహా పడిపూజ కార్యక్రమాన్ని మరింత వైభవంగా, విజయవంతంగా నిర్వహించారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ భక్తి కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్ప స్వాములు, బక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భిక్ష స్వీకరించారు.ఈ పూజా కార్యక్రమానికి స్థిరాస్తి వ్యాపారులు, పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుపై హర్షం.. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

- గిరిజనుల చిరకాల స్వప్నం సాకారం.. ప్రత్యేక ఎస్టీ కమిషన్‌పై హర్షం!
- ఎస్టీ కమిషన్ ఏర్పాటుతో గిరిజనుల హక్కులకు భరోసా.. సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు!
- గిరిజనుల పక్షాన ప్రభుత్వ నిర్ణయం.. బానోత్ శ్రావణ్ నాయక్ హర్షం!



ఘట్కేసర్, నవంబర్ 17 (జనం సాక్షి): మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని 8వ డివిజన్ పోచారం కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోత్ శ్రావణ్ నాయక్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రయోజనాలు, హక్కుల పరిరక్షణకు ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్లను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజనుల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయ మన్నారు. గిరిజనులపై జరుగుతున్న వివక్ష, హక్కుల ఉల్లంఘనలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, లోపాలను ప్రత్యేక ఎస్టీ కమిషన్ సమగ్రంగా పరిశీలించాలని ఆయన కోరారు. బాధిత గిరిజనులకు సత్వర న్యాయం అందించేలా కమిషన్ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అలాగే ఎస్టీ కమిషన్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించడంతో పాటు సమర్థులైన అధికారులను నియమించాలని, అవసరమైన సిబ్బందిని సమకూర్చి తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పుడే గిరిజనుల సమస్యలకు పరిష్కారం లభించి, వారి హక్కులకు నిజమైన రక్షణ కలుగుతుందని అభిప్రాయపడ్డారు. గిరిజనుల చిరకాల కోరికను గుర్తించి ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బానోత్ శ్రావణ్ నాయక్ పేర్కొన్నారు.

కోట్‌పల్లి మండలానికి 369 చేయూత పెన్షన్లు మంజూరు

కోట్ పల్లి, నవంబర్ 17 (జనంసాక్షి): అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేయూత అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం కోట్ పల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డితో కలిసి లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..... కోట్ పల్లి మండలానికి మొత్తం 369 పెన్షన్లు మంజూరయ్యాయని, ఈ నెల 19 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని పేర్కొన్నారు.ల ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ..... ఇప్పటికే 90 శాతం హామీలను అమలు చేశామని, మిగిలిన పథకాలను త్వరలో అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తేనె రామచంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నేడు చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

రాజేంద్రనగర్,నవంబర్17(జనంసాక్షి) రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను బుధవారం18న పంపిణీ చేయనున్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారు. నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.



హైకోర్టు ఉత్తర్వులు అమల్లో ఉండగా నిర్మాణాలా?

సెయింట్ పాయిస్ స్కూల్ నిర్మాణాలపై విచారణకు బీజేపీ వినతి

అల్వాల్, నవంబర్ 17 (జనం సాక్షి): అల్వాల్ సర్వే నంబర్ 573లోని సెయింట్ పాయిస్ స్కూల్ యాజమాన్యం చేపడుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా సీనియర్ నాయకుడు ఈ. మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేశారు. 2010 సెప్టెంబర్ 14న హైకోర్టు జారీ చేసిన యథాతథ స్థితి ఉత్తర్వులు అమల్లో ఉండగా నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? కోర్టు ఉత్తర్వుల పరిధిలోని భూమిలో పనులు జరుగుతున్నాయా? అనే అంశాలపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వాలని కోరారు. అనధికార నిర్మాణాలు జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం ప్రతులను మున్సిపల్ కమిషనర్, అల్వాల్ ఆర్డీవో, హైడ్రా, జిల్లా కలెక్టర్‌కు అందజేసినట్లు మురళీకృష్ణ తెలిపారు.

ఓయో హోటళ్లలో పోలీసుల విస్తృత తనిఖీలు

అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చర్యలు: డీసీపీ రమణారెడ్డి



అమీర్‌పేట, నవంబర్ 18 (జనం సాక్షి): ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ఓయో హోటళ్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సీపీ మహేష్ భగవత్, డీసీపీ రమణారెడ్డి ఆదేశాల మేరకు ఏసీపీ రాఘవేంద్రరావు పర్యవేక్షణలో ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. హోటళ్లలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు డీసీపీ రమణారెడ్డి తెలిపారు. హోటళ్ల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ కార్యకలాపాలకు అవకాశం కల్పించవద్దని సూచించారు. ఈ తనిఖీల్లో అడ్మిన్ ఎస్ఐ సుధీర్‌రెడ్డి, మధుసూదన్‌తో పాటు పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నా భూమిలో నేనే స్వాధీనంలో ఉన్నాను

- భూ సమస్య పరిష్కారం కోసం పెద్దలను, పోలీసులను ఆశ్రయించాము !
- పిట్ల నరేష్, పద్మమ్మ దంపతుల వెల్లడి



యాలాల్ నవంబర్ 17 (జనంసాక్షి) : యాలాల మండలం పగిడ్యాల్ గ్రామంలోని సర్వే నెంబర్ 96అ 4/1/2లో గల 1.00 ఎకరం భూమి మరియు కోళ్ల ఫారం విషయంలో నెలకొన్న వివాదంపై బాధితులు పిట్ల నరేష్, పద్మమ్మ దంపతులు స్పందించారు. తమ భూమిలో తామే స్వాధీనంలో ఉండి సాగు చేసుకుంటున్నామని వారు స్పష్టం చేశారు. ఈ భూమికి సంబంధించి బర్ల వెంకటేశం, అతని కుటుంబ సభ్యులు గ్రామ పెద్దల సమక్షంలో మూడు దఫాలుగా రూ. 54,50,000/- తీసుకున్నారని, ఆ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతోనే భూమిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.ఈ వివాదంలో పోలీసుల ప్రమేయం గానీ, కుల సంఘాల జోక్యం గానీ లేదని, తాము సమస్యను చట్టపరంగా మరియు శాంతియుతంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. అయితే, జూనియర్ అడ్వకేట్ యాదగిరి కులాన్ని అడ్డం పెట్టుకుని బర్ల వెంకటేశంతో కలిసి తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, తమపై దాడికి ప్రేరేపిస్తున్నాడని వారు ఆరోపించారు.ఇట్టి విషయంలో ఏడాదిన్నర క్రితమే తాండూర్ న్యాయస్థానం నుండి తమకు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ, గతంలో వెంకటేశం కుటుంబ సభ్యులు తమపై గొడ్డలితో దాడి చేయగా పద్మమ్మ తలకు 10 కుట్లు పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తెచ్చి తమకు న్యాయం చేయాలని పిట్ల దంపతులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బొంతు శ్రీదేవి యాదవ్ జన్మదిన వేడుకలు



కాప్రా, నవంబర్ 17 (జనం సాక్షి) : చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు కార్యకర్తలు డివిజన్ ప్రజల మధ్య ఘనంగా నిర్వహించారు. జన్మదినశీ పురస్కరించుకొని బొంతు శ్రీదేవి దంపతులు కుషాయిగూడ లోని శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా బోడిగ ప్రభు గౌడ్ ఆధ్వర్యంలో, వివిధ కాలనీలకు చెందిన నాయకులు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు పెద్ద సంఖ్యలో హాజరై బొంతు శ్రీదేవి యాదవ్ ను శాలువాతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

జనంసాక్షి

డా. బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్న కమ్మదనం నర్సింహా

మొయినాబాద్ జనం సాక్షి (నవంబర్ 17):



న్యూ ఢిల్లీలోని కరోల్ భాగ్ లో జరిగిన సదస్సులో భాగంగా 14 రాష్ట్రాల ప్రతినిధులు, సమక్షంలో డా. బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డును చిన్న మంగళారం గ్రామ నివాసి కమ్మదనం నర్సింహా బహుజన సాహిత్య అకాడమీ 20 వ జాతీయ సదస్సులో జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.సామాజిక సేవ, సమాజ అభ్యున్నతి, ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న వారిని గుర్తించి, ప్రోత్సహించాలనే లక్ష్యంతో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో అవార్డులను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో డా. బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డుకు కమ్మదనం నర్సింహా అవార్డు కావడం విశేషం.ఈ కార్యక్రమంలో కరోల్ భాగ్ మీూా ఆసిస్ రవిజీ , ఢిల్లీ కమిషనర్ సంధ్యారాణి, దీూా రాష్ట్ర నాయకులు, మల్లగళ్ల మల్లేష్,కోటేశ్వరరావు, విష్ణు వర్ధన్, అవార్డుల ఎంపిక కమిటీ సభ్యులు, ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు చొక్కంపేట అంజనేయులు, సామాజిక ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపికైన కమ్మదనం నర్సింహాను పలువురు అభినందించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

ఖరీదైన మద్యం సీసాల్లో చీప్ లిక్కర్.. ఇద్దరి అరెస్ట్

శంషాబాద్,నవంబర్17(జనంసాక్షి) : ఖరీదైన మద్యం బ్రాండ్ల ఖాళీ సీసాల్లో చీప్ లిక్కర్ నింపి అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు వంగలి అశోక్ (43), మహ్మద్ యాకూబ్ (29) నుంచి 10 కల్తీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ సర్కిల్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకోగా, నిందితులపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పటేల్ కరుణాకర్



తాండూరు నవంబర్ 17(జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ ప్రజలకు పెన్షన్ 4వేల రూపాయలు అందించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పటేల్ కరుణాకర్ కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటరి మరియు వితంతు మహిళలు, వికలాంగులతో పాటు వయోవృద్ధులకు పెన్షన్ వెంటనే అందజేయాలి. పెన్షన్ లేక వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలలో ఇచ్చిన గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి" అని అన్నారు.రైతులకు రైతుబంధు ఇవ్వక మొత్తానికే రైతులను మోసం చేశారు. మహిళలకు గృహలక్ష్మి ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడం చాలా విచారకరం. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి కూడా ఇవ్వకపోవడంతో తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది" అని పటేల్ కరుణాకర్ తెలియజేశారు.

25న తాండూర్‌లో అయ్యప్ప పడిపూజ





- **పైలెట్ రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏటా ఘనంగా పడిపూజ నిర్వహణ**
- **ఈసారి కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు**

తాండూరు నవంబర్ 17(జనంసాక్షి) :అయ్యప్ప స్వామి భక్తులకు తాండూర్‌లో మరోసారి ఆధ్యాత్మిక సందడి మొదలుకానుంది. ఈనెల 25న తాండూర్‌లో నిర్వహించనున్న అయ్యప్ప స్వామి పడిపూజను ఈసారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ ఏడాది మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అయ్యప్ప స్వామిపై ప్రత్యేక భక్తిభావం ఉన్న పైలెట్ రోహిత్ రెడ్డి ఈ ఏడాది కూడా వేడుకను వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పైలెట్ రోహిత్ రెడ్డి తండ్రి పంజుగుల విఠల్ రెడ్డి అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పడిపూజ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమం విజయవంతంగా జరిగేలా కమిటీ సభ్యులు, స్వాములకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఠల్ రెడ్డితో పాటు మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిపూర్ నర్సింలు, శ్రీనివాస్ చారి, వెంకట్ రెడ్డి, సర్పంచ్ పాండు రంగారెడ్డి, చెంగోల్ వేణు గౌడ్, కె.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం సదరం సర్టిఫికెట్లు ఉన్నా.. అందని దివ్యాంగుల పెన్షన్లు



బంట్వారం నవంబర్ 17 జనం సాక్షి : బంట్వారం మండలం సల్బత్తాపూర్కు చెందిన ఈడిగి రమేష్ గౌడ్, బేగరి నాగయ్య ప్రమాదాల్లో గాయపడి దివ్యాంగులుగా మారారు. వీరికి సదరం ధ్రువీకరణ పత్రాలు ఉన్నప్పటికీ చేయూత దివ్యాంగుల పెన్షన్లు మంజూరు కాలేదు. దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేర్లు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

మంగ్రాస్‌పల్లిలో వేగంగా కొనసాగుతున్న భూ రీసర్వే

- **486.07 ఎకరాల్లో సర్వే పూర్తి.. 80 శాతానికి పైగా పనులు పూర్తి**
- **ఆర్ఐ గోపాల్, జీపీఓ శ్రీవర్ధన్ పర్యవేక్షణలో సర్వే ముమ్మరం**
- **భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్వప్న**



వికారాబాద్, నవంబర్ 17 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమం వికారాబాద్ జిల్లా బంట్వారం మండల పరిధిలోని మంగ్రాస్‌పల్లి గ్రామంలో వేగంగా కొనసాగుతోంది. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన ఈ గ్రామంలో నవంబర్ 3వ తేదీ నుంచి ప్రారంభమైన భూ రీసర్వే ప్రక్రియ రైతుల సహకారంతో పారదర్శకంగా, పకడ్బందీగా సాగుతోంది.గ్రామ పరిధిలోని మొత్తం 74 సర్వే నంబర్లలో భూ రీసర్వే నిర్వహించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటివరకు 486.07 ఎకరాల్లో సర్వే పనులు పూర్తి కాగా, మొత్తం పనుల్లో దాదాపు 80 శాతానికి పైగా పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన సర్వే పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. మండల తహసీల్దార్ విజయ్ కుమార్ సూచనల మేరకు ఆర్ఐ గోపాల్, జీపీఓ శ్రీవర్ధన్ పర్యవేక్షణలో సర్వే పనులు కొనసాగుతున్నాయి. యువ సర్వేయర్లు రజినీకాంత్, భరత్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను పరిశీలిస్తూ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులకు భూ రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. భూముల హద్దుల విషయంలో భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా, భూ రికార్డుల్లో పారదర్శకత పెంపొందించడంతో పాటు రైతులకు తమ భూములపై స్పష్టమైన వివరాలు అందించడమే ఈ రీసర్వే ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొంటున్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, భూ రీసర్వే ప్రక్రియను ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్వప్న కూడా హాజరై పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని తెలుసుకున్నారు. గ్రామంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సర్వే సజావుగా సాగేందుకు గ్రామ ఉపసర్పంచ్ రియాజుద్దీన్, రెండో వార్డు సభ్యుడు పంజుగుల మల్లేశం సమన్వయం చేస్తూ సర్వే బృందానికి అవసరమైన సహకారం అందిస్తున్నారు. రైతులందరూ తమ భూములకు సంబంధించిన వివరాలు, పత్రాలతో సర్వే బృందానికి సహకరించాలని, భూముల హద్దుల విషయంలో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని గ్రామస్థులకు సూచిస్తున్నారు. మిగిలిన సర్వే పనులను కూడా త్వరగా పూర్తి చేసి రైతులకు భూ వివరాలపై స్పష్టత కల్పించే దిశగా అధికారులు ముందుకు సాగుతున్నారు.